# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



సంపుటి :12 సంచిక :348 శుక్రవారం 21-8-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


## కాంగ్రెస్ పార్టీ జాతి వ్యతిరేకి



02

- వందేమాతర గీతాన్ని రెండు ముక్కలు చేసింది
- దేశ విభజనకు పునాది వేసింది
- రెండు జాతుల సిద్ధాంతానికి ఊపిరి పోసింది
- అమర వీరులను అవమానించింది
- ఆ పార్టీకి వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాలి
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు

## టర్కీ-ఇజ్రాయిల్ మధ్య యుద్ధ మేఘాలు

- సిరియా వేదికగా ఘర్షణలకు ఆస్కారం..
- సిరియాలో టర్కీ ఉనికిని ఒప్పుకోని ఇజ్రాయిల్..
- మధ్యధరా ప్రాంతంలో కూడా రెండు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం..

02



## నీళ్లలో మాకు న్యాయమైన వాటా ఇవ్వండి

కృష్ణా జలాల వాటాపై అంతర్రాష్ట్ర వివాదాలపై భట్టి ఆందోళన

- 31వ దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ లో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి
- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణకు కేంద్రం ఆర్థిక సాయం అందించాలని అమిత్ షాకు వినతి
- నిర్దిష్ట కాలపరిమితిలోగా పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు పూర్తి చేయాలని సూచన

చెన్నై :
తమిళనాడులోని మహాబలిపురం (కోవలం) వేదికగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన 31వ దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, నిధులు మరియు అంతర్రాష్ట్ర వివాదాలపై ఉపముఖ్యమంత్రి కీలక అంశాలను లేవనెత్తారు:
ప్రధానంగా ప్రస్తావించిన అంశాలలో : కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు రావలసిన న్యాయమైన వాటాను చట్టబద్ధమైన ప్రక్రియల ద్వారా త్వరితగతిన కేటాయించాలని కోరారు.
సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర సాయం: కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ,

-మిగతా 2 లో






02

## కీవ్‌పై రష్యా భీకర దాడి

- 12 మంది మృతి
- 33 మందికి గాయాలు
- తొమ్మిది అంతస్తుల భవనానికి మంటలు
- దాడిని ఖండించిన జెలెన్స్కీ



02

## ఎన్డీయేలో బీజేపీ ఆధిపత్యం క్షీణించింది

- రాజకీయంగా మోదీ, అమిత్ షాల పని ఒడిసిపోయింది :
- స్వతంత్ర మెజారిటీ లేక బీజేపీ బలహీనపడింది
- 'ఇండియా' కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది
- ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని రాహుల్ పిలుపు



## 5 గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలపండి

- ఆయిల్ పామ్ గెలల ధర 25000గా నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి
- పెద్దవాగు పునరుద్ధరణకు నిధులు విడుదల చేయాలి
- భద్రాచలం - ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా చేయాలి
- కేంద్రంపై ఒత్తిడి తేవాలని చంద్రబాబును కోరిన మంత్రి తుమ్మల

చెన్నై
కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా అధ్యక్షతన మహాబలిపురంలో జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న ఈ సమావేశంలో తెలంగాణ తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర విభజనతో మిగిలిన అంశాల పరిష్కారం, అంతర్రాష్ట్ర సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సమావేశానికి హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

-మిగతా 2 లో



## 22ఎ అవినీతిపై చర్యలు తీసుకోండి

- ఆ చట్టంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి
- కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకోకపోతే ప్రజా ఆందోళనలు తప్పవు
- రాహుల్ గాంధీకి బిఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీష్ రావు లేఖ

హైదరాబాద్,
తెలంగాణలో ప్రజల భూములను ప్రభుత్వం కబ్జా చేస్తున్నదని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీష్ రావు మండిపడ్డారు. ప్రజల భూములను, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చి ఆస్తులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆక్రమిస్తున్నదని ఆరోపించారు. సెక్షన్ 22ఎ ను దుర్వినియోగం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పాలకులపై చర్యలు తీసుకోనిపక్షంలో ప్రజా పోరాటాలు అనివార్యం అవుతాయని హరీష్ రావు హెచ్చరించారు. 22ఎ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రైవేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి కాంగ్రెస్ పాలకులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తోపాటు హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎమ్‌డీఏ అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను ఏకపక్షంగా

-మిగతా 2 లో



## దక్షిణాదిని రాజకీయంగా శిక్షించొద్దు

- 1971 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ చేయాలి
- లోక్‌సభ స్థానాలను యథావిధిగా కొనసాగించాలి
- సదరన్ కౌన్సిల్ భేటీలో కర్ణాటక సిఎం డికె శివకుమార్
- మిగతా రాష్ట్రాలు మద్దతిస్తాయని ఆశాభావం
- దక్షిణాది రాష్ట్రాల సమస్యలపై చర్చ

02

డీలిమిటేషన్ పేరుతో జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించొద్దని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కేంద్రాన్ని కోరారు. 1971 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకుని లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను యథాతథంగా కొనసాగించాలని, జనాభా నియంత్రణలో విజయవంతమైన రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించే పరిస్థితి రాకూడదని దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో స్పష్టం చేశారు

## 22ఎపై ప్రజలకు భరోసా ఇవ్వండి

కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును బాధ్యతగా తీసుకోవాలి

- సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలి
- నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది
- అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి



హైదరాబాద్:
రాష్ట్రంలో 22ఎ నిషిద్ధ భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూశాఖ చర్యలను మరింత వేగవంతం చేయాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా

-మిగతా 2 లో




## పాఠశాలల దుస్థితిపై దీప్కే ఆగ్రహం


- విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే మెరుగైన వసతులని విమర్శ
- విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని డిమాండ్
- ఉజని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి పరిస్థితుల పరిశీలన
- కనీస మౌలిక వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బందులు
- పాఠశాలల నిర్లక్ష్యానికి ప్రజాప్రతినిధులే బాధ్యులని ఆరోపణ
- 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారంతో అధికారుల్లో కదలిక
- తనిఖీల ఫలితంగా పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

లాతూర్
ప్రభుత్వ పాఠశాలలు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నాయని, విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే మెరుగైన వసతులు అందుతున్నాయని పేర్కొంటూ, మహారాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ఇటీవలే 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారాన్ని ప్రారంభించిన దీప్కే తాజాగా లాతూర్‌లోని ఔసా తహసీల్, ఉజని గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు.అనంతరం

-మిగతా 2 లో

# కీవ్‌పై రష్యా భీకర దాడి

**- 12 మంది మృతి**
**- 33 మందికి గాయాలు**
**- తొమ్మిది అంతస్తుల భవనానికి మంటలు**
**- దాడిని ఖండించిన జెలెన్స్కీ**



కీవ్:
ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా జరిపిన భారీ మిస్సైల్, డ్రోన్ల దాడిలో 12 మంది మరణించారు. ప్రారంభంలో కనీసం ఆరుగురు మరణించినట్లు ఉక్రెయిన్ స్టేట్ ఎమర్జెన్సీ సర్వీస్ ప్రకటించింది. తర్వాత మరణాల సంఖ్య 12 కు చేరుకుంది. 33 మందికి పైగా గాయపడ్డారు. సోలోమియాన్స్కీ జిల్లాలో తొమ్మిది అంతస్తుల నివాస భవనం పైభాగం ధ్వంసమై మంటలు చెలరేగాయి. రెస్క్యూ బృందాలు శిధిలాల నుంచి ఇద్దరిని బయటకు తీశాయి. అదే జిల్లాలోని పిల్లల ఆసుపత్రి దెబ్బతిని కిటికీలు పగిలాయి. చుట్టూ ఉన్న కార్లు తగలబడిపోయాయి. స్వియాటోషిన్స్కీ, డార్నిట్స్కీ జిల్లాల్లో కూడా నివాస భవనాలు, గిడ్డంగులు పాఠశాలలు ధ్వంసమైపోయాయి. రష్యా బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లను ఉపయోగించింది. ఉక్రెయిన్ వైమానిక దళం చాలా డ్రోన్లను కూల్చివేసినా బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోవడంలో ఇబ్బంది ఎదురైంది. బ్రోవారీ జిల్లాలో ఒకరు మరణించారు. మరొకరు గాయపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కీవ్ మేయర్ విటాలి క్లిట్స్కో ప్రజలను ఆశ్రయాల్లో ఉండాలని హెచ్చరించారు. ఆగస్టు 21న సంతాప దినంగా ప్రకటించారు. పౌరులపై రష్యా దాడి చేస్తోందని అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు. దాడిని ఖండించారు. గగనతల రక్షణ వ్యవస్థలకు తగినంత క్షిపణులు లేకపోవడమే కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. సైనిక లక్ష్యాలపైనే దాడి జరిగిందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ చెప్పింది. అయితే ఉక్రెయిన్ అధికారులు పౌర ప్రాంతాలు దెబ్బతిన్నాయని స్పష్టం చేశారు. ఒడెస్సా, చెర్నిహివ్ ప్రాంతాల్లో కూడా దాడులు జరిగి పలువురు గాయపడ్డారు. సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## టర్కీ-ఇజ్రాయిల్ మధ్య యుద్ధ మేఘాలు

**- సిరియా వేదికగా ఘర్షణలకు ఆస్కారం..**
**- సిరియాలో టర్కీ ఉనికిని ఒప్పుకోని ఇజ్రాయిల్..**
**- మధ్యధరా ప్రాంతంలో కూడా రెండు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం..**



న్యూఢిల్లీ : మిడిల్ ఈస్ట్‌లో మరో యుద్ధానికి రంగం సిద్ధమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గాజా యుద్ధం తర్వాత సిరియా వేదికగా టర్కీ, ఇజ్రాయిల్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఈ రెండు దేశాలు అమెరికాకు మిత్రదేశాలుగా ఉన్నాయి. టర్కీ నాటోలో సభ్యదేశంగా ఉంది.
మరోవైపు ఇజ్రాయిల్‌కు ప్రతీ విషయంలో అమెరికా అండ ఉంటోంది. ఈ రెండు దేశాల మధ్య ఇప్పటికిప్పుడు యుద్ధం జరిగే అవకాశాలు లేకున్నా, పరిస్థితుల్ని బట్టి చిన్నపాటి సైనిక ఘర్షణను మాత్రం తోసిపుచ్చలేమని నిపుణులు చెబుతున్నారు. గాజా యుద్ధం టర్కీ, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలకు ప్రధాన కారణంగా ఉంది. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ఇజ్రాయెల్ సైనిక చర్యలను నిరంతరం విమర్శిస్తూ వస్తున్నారు. ఆయన పాలస్తీనాకు బహిరంగంగా మద్దతు తెలిపారు. గాజాలోని పౌరులను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు. టర్కీ వైఖరి పట్ల ఇజ్రాయిల్ కూడా సంతృప్తిగా లేదు. పశ్చిమాసియాలో తమ ప్రయోజనాలకు టర్కీ ఒక సవాల్‌గా నిలుస్తోందని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నేతన్యాహూ భావిస్తున్నారు. సిరియాలో టర్కీ, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉంది. సిరియాలో పాలన మార్పు, బషర్ అల్ అసద్‌ను గద్దె దించడంలో టర్కీ అమెరికాకు సహకరించింది. టర్కీ కొత్తగా ఏర్పడిన సిరియా ప్రభుత్వంతో సన్నిహితంగా ఉంటోంది. అక్కడ టర్కీ తన సైనిక ఉనికిని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ పరిస్థితుల్ని ఇజ్రాయిల్ నిశితంగా గమనిస్తోంది. సిరియాలో పెరుగుతున్న టర్కీ సైనిక ఉనికి తమ భద్రతకు ముప్పుగా ఇజ్రాయిల్ భావిస్తోంది. మధ్యధరాలో కూడా టర్కీ వర్సెస్ ఇజ్రాయిల్ : టర్కీ, ఇజ్రాయిల్ మధ్య ఘర్షణ కేవలం గాజా, సిరియాలకు మాత్రమే పరిమితం కాలేదు. మధ్యధరా సముద్ర ప్రాంతంలో కూడా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉన్నాయి. ఈ సముద్రంలో గ్యాస్ నిల్వల విషయంలో రెండు దేశాల మధ్య ఘర్షణ ఉంది.

## నీళ్లలో మాకు న్యాయమైన వాటా ఇవ్వండి

మొదటి తరువాయి

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం మరియు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.
విభజన సమస్యల పరిష్కారం: ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 కింద పెండింగ్‌లో ఉన్న షెడ్యూల్ 9 మరియు షెడ్యూల్ 10 సంస్థల ఆస్తుల పంపిణీ సమస్యలను నిర్దిష్ట కాలమితిలో పరిష్కరించాలని స్పష్టం చేశారు.
సహకార సమైక్యత: దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక అభివృద్ధి, రవాణా, విద్యుత్, మౌలిక వసతుల విషయంలో పరస్పరం సహకరించుకోవాలని, తదుపరి 32వ దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ప్రతిపాదించారు.

## 22ఎపై ప్రజలకు భరోసా ఇవ్వండి

మొదటి తరువాయి

ఇచ్చారు. 22ఎ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై గురువారం అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఎ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీఓ, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు.
ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా
ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీఓలు, కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, నూతన దరఖాస్తుల రోజువారీ రోజువారీ వేగంగా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జాతి వ్యతిరేకి

**- వందేమాతర గీతాన్ని రెండు ముక్కలు చేసింది**
**- దేశ విభజనకు పునాది వేసింది**
**- రెండు జాతుల సిద్ధాంతానికి ఊపిరి పోసింది**
**- అమర వీరులను అవమానించింది**
**- ఆ పార్టీకి వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాలి**
**- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు**



**మహాబలిపురం:**
వందేమాతరం గీతాన్ని అవమానించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ జాతి వ్యతిరేకిగా వ్యవహరిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. గురువారం తమిళనాడు, మహాబలిపురం, కోవలం వద్ద ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆగస్టు 20న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వందేమాతరంపై ఆశ్చర్యకరమైన, దేశవ్యతిరేక నిర్ణయం తీసుకుంది. తమ పార్టీ 1937 నాటి తీర్మానాన్ని అనుసరించి వందేమాతరంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలని నిర్ణయించుకున్నారు అని విమర్శించారు.
ముస్లిం బుజ్జగింపు రాజకీయాలు
యావత్ దేశానికి ఒక విషయం గుర్తు చేస్తున్నాను. 1937లో ముస్లింలను బుజ్జగించడానికి వందేమాతరాన్ని రెండు ముక్కలుగా చేసి, దేశ విభజనకు కాంగ్రెస్ పార్టీ పునాది వేసింది. అక్కడి నుంచి రెండు జాతుల సిద్ధాంతానికి బలం చేకూరింది. చివరకు దేశం విభజనకు గురై పాకిస్తాన్ పుట్టింది. నేడు వందేమాతరం ఆవిర్భావానికి 150వ సంవత్సరంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ చారిత్రక తప్పును సరిదిద్ది బంకిమ్ బాబు అమర కృతిని పూర్తిగా పాడించి జాతీయ సమైక్యతను బలోపేతం చేసే ప్రయత్నం చేసింది. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో దానిని పూర్తిగా పాడాలనే నిర్ణయానికి చట్టపరమైన రూపం కూడా ఇచ్చింది అని అమిత్ షా తెలిపారు.
అమర వీరులకు అవమానం
కాంగ్రెస్ పార్టీ నేతలు స్వర్గీయ బంకిమ్ బాబు అమర కృతిని అవమానించడమే కాకుండా వందేమాతర నినాదం చేస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం ఉరి కంబం ఎక్కిన లక్షలాది మంది అమరవీరులను కూడా అవమానించారు. అలాగే చాలా సంవత్సరాలు జైలులో గడిపిన వారిని కూడా అవమానించారు. నేడు కాంగ్రెస్ పార్టీ తన 1937 నాటి పార్టీ తీర్మానాన్ని అంగీకరించి పార్లమెంట్ చట్టాన్ని తిరస్కరిస్తోంది. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఈ దేశంలో బుజ్జగింపు రాజకీయాలను బలంగా ముందుకు తీసుకెళ్లడాన్ని నేను విస్తుపోతున్నానని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.
కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాలి
ఈ దేశం ఒకసారి వందేమాతరాన్ని రెండు ముక్కలుగా చేయడానికి అనుమతించి తీవ్రమైన పరిణామాలను అనుభవించింది. ఇప్పుడు దేశ ప్రజలు ఒకమ్మై కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి. నిరసన గళం వినిపించాలి. ఇకపై బుజ్జగింపు రాజకీయాలు ఈ దేశంలో పనిచేయవు. ఇది స్వచ్ఛా దేశం. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచిన తర్వాత 1937లో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం సరిదిద్దిన దానికి ఏమాత్రం వ్యతిరేకతను ఈ దేశ ప్రజలు సహించరు. భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తోంది. ప్రజల్లో, చట్టసభల్లో దీనిని బలంగా వ్యతిరేకిస్తాము అని అమిత్ షా స్పష్టం చేశారు.

## ఎన్డీయేలో బీజేపీ ఆధిపత్యం క్షీణించింది



న్యూఢిల్లీ
ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర హోంమంత్రి అమిత్ షా లపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని, మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడంవల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపోయాయని రాహుల్‌గాంధీ అన్నారు. గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## దక్షిణాదిని రాజకీయంగా శిక్షించొద్దు

**-1971 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ చేయాలి**
**- లోక్‌సభ స్థానాలను యథావిధిగా కొనసాగించాలి**
**- సదరన్ కౌన్సిల్ భేటీలో కర్ణాటక సిఎం డికె శివకుమార్**
**- మిగతా రాష్ట్రాలు మద్దతిస్తాయని ఆశాభావం**
**- దక్షిణాది రాష్ట్రాల సమస్యలపై చర్చ**



చెన్నై:
దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఏపీ సిఎం చంద్రబాబు, తమిళనాడు సిఎం విజయ్, కర్ణాటక సిఎం డికే శివకుమార్, కేరళ సిఎం సతీశన్, తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తదితరులు హాజరయ్యారు. దక్షిణ ప్రాంతీయ మండలి 31వ సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి డికే శివకుమార్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశాన్ని ప్రస్తావించారు. తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ మధ్య కూడా కీలక చర్చ జరిగినట్లు సమాచారం. కావేరీ జలాల పంపిణీ, మేకేదాటు ప్రాజెక్టు అంశాల నేపథ్యంలో.. సమావేశంలో కర్ణాటక సీఎంతో పాటు పక్కనే కూర్చున్న తమిళనాడు సీఎం విజయ్‌తో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్ కేంద్రపాలిత ప్రాంతాలు దక్షిణ ప్రాంతీయ మండలిలో సభ్యులుగా ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు 1971 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా కొనసాగించాలని, వచ్చే 25 ఏళ్ల పాటు లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాల సంఖ్యను మార్చవద్దని కేంద్రాన్ని కోరుతూ దక్షిణ ప్రాంతీయ మండలి తీర్మానం చేయాలని శివకుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న ఈ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు దేశ పిలుపును విజయవంతంగా అమలు చేశాయని, అందుకు వాటిని రాజకీయంగా శిక్షించకూడదని ఆయన అన్నారు. జనాభాను సమర్థంగా నియంత్రించినందుకు దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గడానికి వీల్లేదని స్పష్టం చేశారు. "ఈ దక్షిణాది రాష్ట్రానికి లోక్‌సభ స్థానాలు తగ్గవని ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నాం. అయితే ప్రాతినిధ్యం కేవలం సంఖ్యకు సంబంధించిన విషయం కాదు. అది రాజకీయ బలం, మన గొంతుకు సంబంధించిన అంశం" అని శివకుమార్ అన్నారు. 1971 జనాభా ప్రాతిపదికను గౌరవిస్తూ లోక్‌సభ మొత్తం స్థానాల సంఖ్యను యథాతథంగా కొనసాగించాలని ఆయన కోరారు. "ఇక్కడున్న ముఖ్యమంత్రులందరూ నేను చెబుతున్నదానికి మద్దతు ఇస్తారని నమ్ముతున్నాను. 1971 ప్రాతిపదికను గౌరవిద్దాం. మన గొంతుక బలాన్ని కాపాడుకుందాం" అని ఆయన అన్నారు.
మేకేదాటు ప్రాజెక్టు కర్ణాటకకు మాత్రమే కాకుండా తమిళనాడుకు కూడా ముఖ్యమైనదని శివకుమార్ పేర్కొన్నారు. సమావేశానికి వెళ్తున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనతో మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు మధ్య కావేరీ జలాల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారని ఆయన తెలిపారు. "మేకేదాటు ప్రాజెక్టు నుంచి వచ్చే ప్రతి నీటి బొట్టు తమిళనాడు, పుదుచ్చేరి రైతులకు ఉపయోగపడుతుంది. మాకు సహకరించండి.. మేమూ మీకు సహాయం చేస్తాం" అని శివకుమార్ అన్నారు.


## పాఠశాలల దుస్థితిపై దీప్కే ఆగ్రహం

మొదటి తరువాయి

ఆయన విలేకరులతో మాట్లాడుతూ సరైన తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, సురక్షితమైన రాకపోకల వంటి కనీస మౌలిక వసతులు లేని అనేక పాఠశాలల దుస్థితికి ప్రజాప్రతినిధులు, మంత్రులే జవాబుదారీ వహించాలని అన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులను జంతువుల కంటే హీనంగా చూస్తున్నారని ఆయన ఆరోపించారు. కాగా సీజేపీ చేపట్టిన తనిఖీలు అధికారులను కదిలించాయని, పాఠశాలల్లో ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభమయ్యేలా చేశాయని దీప్కే తెలిపారు.

## 5 గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలపండి

మొదటి తరువాయి



నారా చంద్రబాబు నాయుడుకు పలు కీలక అంశాలపై లేఖల ద్వారా విజ్ఞప్తులు చేశారు. ముఖ్యంగా భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయడం, పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటా నిధులు అందించడం, ఆయిల్ పామ్ రైతులకు కనీస హామీ ధర కల్పించడం, భద్రాచలం--ఏలూరు అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రంపై ఒత్తిడి తేవడం వంటి అంశాలపై మంత్రి వారిని కలిసి విజ్ఞప్తి చేశారు.
భద్రాచలం పరిసర ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భద్రాచలం పట్టణానికి భౌగోళికంగా, పరిపాలనాపరంగా అత్యంత సమీపంలో ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు ఆంధ్రప్రదేశ్లోనే కొనసాగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. యటపాక, కన్నాయిగూడెం, పిచ్చి కలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీల పరిధిలోని 19 రెవెన్యూ గ్రామాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తిరిగి విలీనం చేయాలని కోరారు. ఈ గ్రామాల మొత్తం భౌగోళిక విస్తీర్ణం 11,122.01 ఎకరాలుగా లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ గ్రామాలు తెలంగాణ భూభాగాల మధ్య గోదావరి నది, రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల మధ్య ఒక ప్రత్యేక భౌగోళిక పరిస్థితిలో ఉండటంతో ప్రజలకు పరిపాలన సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి వివరించారు.
అల్లురి సీతారామరాజు జిల్లా కేంద్రం సుమారు 282 కిలోమీటర్ల దూరంలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉందని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు, నిత్యవసర వస్తువుల రవాణాలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ల కారణంగా గిరిజన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దులకు సమీపంలో, గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో పోలీసు, భద్రతా వ్యవస్థల మధ్య సమన్వయానికి కూడా ప్రస్తుత భౌగోళిక పరిస్థితి సమస్యగా మారుతోందని మంత్రి తెలిపారు.
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం తెలంగాణలో ఉండగా, ఆలయానికి సంబంధించిన గణనీయమైన భూములు పురుషోత్తపట్నంలో ఉండటం వల్ల ఆలయ పరిపాలనలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ అంశంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యం చేసుకొని, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ అనంతరం ఏర్పడిన భౌగోళిక అసమానతను సరిదిద్దేలా ఐదు గ్రామ పంచాయతీలను, వాటి పరిధిలోని 19 రెవెన్యూ గ్రామాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తిరిగి చేర్చే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి కోరారు. ఇదే అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కూడా మంత్రి విజ్ఞప్తి చేశారు.
పెద్దవాగు ప్రాజెక్టు పునరుద్ధరణకు ఏపీ వాటా నిధులు ఇవ్వాలి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెద్దవాగు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు 2024 జులై 18న కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో శాశ్వత పునరుద్ధరణ పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటా నిధులను వెంటనే అందించాలని మంత్రి తుమ్మల కోరారు.

## 22ఎ అవినీతిపై చర్యలు తీసుకోండి

మొదటి తరువాయి

22ఎ జాబితా లో చేర్చి వేధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల రాకెట్ విస్తరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించేందుకు దళారులు మార్కెట్ విలువలో ఏకంగా 30 కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22ఎ చేర్చినట్లు నాలుగు నెలల క్రితమే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పినా సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల భూములపై వివాదాలు సృష్టించి రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్కు ఇవ్వాలని యజమానులపై కాంగ్రెస్ పాల కులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని రెవెన్యూ శాఖలో ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం భారీ కుంభకోణం జరుగు తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని లేఖలో రాహుల్ గాంధీకి తెలిపారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు నిషేధిత జాబితాలో చేర్చిన, తొలగించిన ప్రతి భూమిపైనా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల క్రితమే అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద క్రమబద్ధీకరించిన ఆస్తులను, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉన్న భూములను మళ్లీ 22ఎ లో చేర్చి స్తంభింపజేయడం దుర్మార్గమని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాల వారీగా 22ఎ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ దోపిడీపై రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోకపోతే కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# బంగ్లాదేశ్ దేశాధ్యక్షుడిగా మిర్జా ఫక్రుల్ ఇస్లామ్ ఎన్నిక




**ఢాకా:**

బంగ్లాదేశ్ 23వ దేశాధ్యక్షుడిగా మిర్జా ఫక్రుల్ ఇస్లామ్ ఆలమ్‌గిర్ ఎన్నికయ్యారు. ఆయనకు అనుకూలంగా 255 ఓట్లు పోలయ్యాయి. 11 పార్టీల కూటమికి చెందిన అభ్యర్థి ఒలీ అహ్మద్‌పై ఆయన విజయం సాధించారు. ప్రత్యర్థికి కేవలం 88 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. మిర్జా ఫక్రుల్ విజయం సాధించినట్లు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏఎంఎం నాసిర్ ఉద్దిన్ ప్రకటించారు. జాతీయ పార్లమెంట్ బిల్డింగ్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఓటింగ్ జరిగింది. తాత్కాలిక అధ్యక్షుడు హఫీజ్ ఉద్దిన్ అహ్మద్ బిర్ బిక్రమ్ తొలి ఓటు వేశారు. డిప్యూటీ స్పీకర్ కేసర్ కమల్, ప్రధాని తారిక్ రహ్మాన్ ఓటేశారు. రిటర్నింగ్ ఆఫీసర్‌గా సీఈసీ నాసిర్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌లో దేశాధ్యక్షుడి పోస్టుకు ఎన్నికలు నిర్వహించారు. చివరిసారి 1991, అక్టోబర్ 8వ తేదీన ఆ ఎన్నిక జరిగింది. ఆ తర్వాత ఓటింగ్ లేకుండానే పలుమార్లు దేశాధ్యక్షులను నియమించారు. 1996, 2001, 2002, 2009, 2013, 2018, 2023లో ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించారు. పార్లమెంట్‌లో ప్రస్తుతం బీఎన్పీ పార్టీకి మూడోవంతు మెజారిటీ ఉన్నది. శుక్రవారం మిర్జా ఫక్రుల్ దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

# నలుగురు బాలికలపై అత్యాచారం..


**-తమిళనాడు పాస్టర్‌కు మరణశిక్ష**



**తిరునల్‌వెల్లి:** ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) : తమిళనాడులోని నలుగురు బాలికలను లైంగికంగా వేధించిన కేసులో ఓ నిందితుడికి తిరునల్‌వెల్లి పోక్సో కోర్టు(గూజుబూ జశీబతీ) మరణశిక్ష విధించింది. నిందితుడిని 47 ఏళ్ల అబ్రహంగా గుర్తించారు. జడ్జి సురేశ్ కుమార్ ఈ కేసులో తీర్పు ఇచ్చారు. నిందితుడికి నాలుగు మరణశిక్షలు వేశారు. 52వేల జరిమానా విధించారు. బాధిత అమ్మాయిలకు ఒక్కొక్కరికి 10 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని కోర్టు ఆదేశించింది. 2022 జూలై 5వ తేదీన తిరునల్‌వెల్లిలోని మహిళా పోలీసు స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు అయ్యింది. ఓ బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసును రిజిస్టర్ చేశారు. అబ్రహంను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. ఛార్జ్‌షీట్‌లో సాక్ష్యాలను నిరూపించినట్లు జడ్జీ సురేశ్ కుమార్ తేల్చారు. తిరునల్‌వెల్లి జిల్లాలోని గంగైకొండ సమీపంలో ఉన్న మేలైలంతైకులం చర్చిలో అమ్మాయిలను బంధించి, వారిపై అత్యాచారానికి పాల్పడినట్ల పాస్టర్ అబ్రహంపై ఆరోపణలు ఉన్నాయి. చర్చికి వెళ్లిన అమ్మాయిలను అక్రమంగా ప్లాస్టర్ బంధించాడని, ఆ తర్వాత లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఒకవేళ విషయాన్ని బయట చెబితే చంపేస్తానని బెదిరించినట్లు ప్రాసిక్యూషన్ తన వాదనల్లో పేర్కొన్నది.

# పాకిస్థాన్ టిక్‌టాకర్ హత్య..

**-ఆమెకు 13 లక్షల మంది ఫాలోవర్లు**



**ఇస్లామాబాద్**ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) : పాకిస్థాన్‌కు చెందిన టిక్‌టాక్ క్రియేటర్ , 28 ఏళ్ల షామ్‌సో బీబీ హత్యకు గురైంది. ఇస్లామాబాద్ సమీపంలో తక్సిలాలో ఆమెను పిస్తోల్‌తో కాల్చి చంపారు. ఆగస్టు 14వ తేదీన ఈ ఘటన జరిగింది. ఆమెకు టిక్‌టాక్‌లో 13 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. గత కొన్ని రోజుల నుంచి బీబీకి బెదిరింపు కాల్స్ వస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఆ క్రియేటర్ పేరు అయేషా గిల్మానా. సోదరి, సోదరుడితో కారులో కలిసి ప్రయాణిస్తున్న సమయంలో.. బైక్‌పై వచ్చిన ఇద్దరు అడ్డగించి కాల్పులు జరిపారు. బీబీకి మెడలో బుల్లెట్ దిగింది. గాయాల వల్ల ఆమె మరణించింది. పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఈ మర్డర్ జరిగింది. ఈ హత్య కేసులో నలుగురు అనుమానితులను పోలీసులు అరెస్టు చేశారు. కాల్పులు జరిపిన వ్యక్తి పరారీ కోసం సాయం చేసిన ఇద్దర్నీ అదుపులోకి తీసుకున్నారు. కనీసం నాలుగేళ్ల నుంచి బీబీ టిక్‌టాక్ వీడియోలు చేస్తున్నది. ఓ దుస్తుల కంపెనీకి బ్రాండ్ ప్రమోషన్ కూడా చేస్తోంది. డబ్బుల విషయంలో చాన్నాళ్ల నుంచి ఇద్దరు వ్యక్తులు వేధిస్తున్నట్లు ఆమె తండ్రి చెప్పాడు. అయితే వారే ఈ హత్యకు పాల్పడి ఉంటారని ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు.

# సిక్కు వ్యతిరేక అల్లర్ల దోషి సజ్జన్ మృతి



**న్యూఢిల్లీ :**ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషి సజ్జన్ కుమార్ (80) మృతి చెందారు. తీహార్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఆయన గురువారం ఉదయం అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన సఫ్దర్ జంగ్ దవాఖానకు తరలించారు. అప్పటికే మరణించినట్టు డాక్టర్లు తెలిపారు. ఇందిరాగాంధీ హత్య తర్వాత ఢిల్లీలో 1984 నవంబర్ 1న చెలరేగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో 2,700 మంది చనిపోయారు. ఇదే అల్లర్లలో 3,500 మంది ప్రాణాలు కోల్పోయారు. ఐదుగురు సిక్కుల హత్యకు సంబంధించిన కేసులో సజ్జన్ దోషిగా తేలడంతో 2018లో ఢిల్లీ హైకోర్టు జీవితఖైదు శిక్ష విధించింది. ఇద్దరు తండ్రీ కొడుకుల హత్య కేసులోనూ సజ్జన్ దోషిగా తేలారు. ఈ కేసులపై ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా ఇంకా విచారణ కొనసాగుతున్నది.

# కల్తీ మద్యం తాగి ఏడుగురు మృతి..

**-30 మంది ఆసుపత్రిపాలు**



**గాంధీనగర్** ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) : మిథనాల్ కలిపిన కల్తీ మద్యం తాగి ఏడుగురు వ్యక్తులు మరణించారు. మరో 30 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో 12 మంది కల్తీ మద్యం వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. 21 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్యపాన నిషేధం అమలులో ఉన్న గుజరాత్‌లో ఈ సంఘటన జరిగింది. మంగళవారం సాయంత్రం భావనగర్ జిల్లాలోని ఒక గ్రామంలో మద్యం పార్టీ చేసుకున్న ఐదుగురు స్నేహితులు అస్వస్థతకు గురయ్యారు. పలు గ్రామాల ప్రజలతో పాటు భావ్‌నగర్ నగరంలోని పలు ప్రాంతాల వారు కూడా నకిలీ మద్యం కారణంగా ఆసుపత్రిపాలయ్యారు. కాగా, మిథనాల్ కలిపిన కల్తీ మద్యం తాగి ఏడుగురు వ్యక్తులు మరణించగా, మరో 30 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, జిల్లా అధికారులు అలెర్ట్ అయ్యారు. మరణించిన, చికిత్స పొందుతున్న రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాల్లో విషపూరితమైన మిథనాల్ ఆనవాళ్లు కనిపించాయి. 'ఇండియన్-మేడ్ ఫారిన్ లిక్కర్' పేరుతో విక్రయించిన కల్తీ మద్యంపై దర్యాప్తు చేశారు. మరోవైపు మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన నరేంద్ర సింగ్ యాదవ్ అలియాస్ 'డాక్టర్' పర్యవేక్షణలో కల్తీ మద్యం వ్యాపారి గౌతమ్ సోలంకి ఇంట్లో విషపూరిత మద్యం తయారు చేసినట్లు పోలీసులు గుర్తించారు. సరస్, గణేష్, అమన్ అనే వ్యక్తులు మిథనాల్ కలిపిన మద్యం తయారీలో పాల్గొన్నట్లు దర్యాప్తులో బయటపడింది. నరేంద్ర సింగ్ యాదవ్ దానిని సేవించగా మరుసటి రోజు అతడి పరిస్థితి విషమించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో కల్తీ మద్యం తయారీ గుట్టురట్టయ్యింది. ప్రధాన నిందితుడైన ఉజ్జయిన్‌కు చెందిన రయీస్, జుబేర్, గౌతమ్ సోలంకిలతో కలిసి ముడి పదార్థాలు తీసుకువచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముగ్గురూ అహ్మదాబాద్‌లోని సర్ఖేజ్ నుంచి తెల్లటి ద్రవం, ఖాళీ సీసాలు, సీసా మూతలు, నకిలీ 'రాయల్ స్టాగ్' స్టిక్కర్లు, మిథనాల్ కొనుగోలు చేసి కల్తీ మద్యం తయారు చేశారు. విషపూరిత రసాయనాన్ని అసలైన మద్యంలా కనిపించేలా బాటిల్స్‌పై నకిలీ 'రాయల్ స్టాగ్' స్టిక్కర్లు అతికించారు. అయితే పోలీసులు స్వాధీనం చేసుకున్న కల్తీ మద్యం సీసాలలో 38.59 శాతం మిథనాల్, కేవలం 0.94 శాతం ఇథనాల్ ఉన్నట్లు గాంధీనగర్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నివేదికలో తేలింది. దీంతో అది సాధారణ మద్యం కాదని, అత్యంత విషపూరితమైన మిథనాల్ ఆధారిత మిశ్రమమని నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో గుజరాత్, మధ్యప్రదేశ్‌కు చెందిన 12 మంది కల్తీ మద్యం వ్యాపారులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. 21 మంది నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# పాకిస్తాన్‌కు గుణపాఠం..

**ఢిల్లీలో పాక్ రాయబార కార్యాలయంపై బుల్డోజర్ యాక్షన్**



న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) : పాకిస్తాన్‌కు భారత్ తగిన గుణపాఠం చెప్పింది. పాకిస్తాన్ చర్యకు ధీటుగా బదులిచ్చింది. ఇటీవల పాకిస్తాన్‌లోని భారత రాయబార కార్యాలయం వద్ద ఉన్న బారికేడ్లను పాక్ ప్రభుత్వం తొలగిస్తే.. ఇప్పుడు ఇండియా కూడా ఇక్కడ ఉన్న పాక్ రాయబార కార్యాలయం వద్ద బుల్డోజర్ చర్యకు దిగింది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారత రాయబార కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం వద్ద ఉన్న సెక్యూరిటీ బారికేడ్లను ఇటీవల పాకిస్తాన్ ప్రభుత్వం తొలగించింది. ఇది జరిగి మూడు రోజులు అవుతోంది. దీంతో పాక్ చర్యకు భారత్ కూడా అదేరీతిలో బదులిచ్చింది. ఢిల్లీలోని పాకిస్తాన్ రాయబార కార్యాలయం వద్ద అదనంగా రక్షణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు, ట్రాఫిక్ బొల్లార్డ్స్ వంటి నిర్మాణాల్ని బుల్డోజర్‌తో కూల్చేసింది. పాక్ రాయబార కార్యాలయ కాంపౌండ్ పరిధిలోని అనేక అనవసర నిర్మాణాల్ని కూల్చివేసింది. ఇది పాక్ చర్యకు బదులుగా చేసినట్లుగానే భావించాలి. అయితే, ఇండియా, పాక్ చేసిన ఈ చర్యలు రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు మరింత నెలకొనేందుకు దారితీసినవే. ఇప్పటికే రెండు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. గతేడాది పహల్గాం దాడి, అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఇరు దేశాల మధ్య వైరం మరింత పెరిగిన సంగతి తెలిసిందే. దీంతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్నాయి. మరోవైపు ఇండియాలో అమెరికా రాయబారి సెర్గియో బుధవారం, గురువారం జమ్మూ కాశ్మీర్, శ్రీనగర్, లదాక్‌లలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సెర్గియో మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్.. భారత్‌లో అంతర్భాగమే అని, అది ఇండియాకు చాలా ముఖ్యమైన ప్రాంతం అన్నారు. అయితే, ఆయన వ్యాఖ్యలను పాకిస్తాన్ ఖండించింది. ఈ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేసిన పాక్.. ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసింది. ఇండియాలో సెర్గియో గోర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పాకిస్తాన్‌లో ఉన్న అమెరికా రాయబారి నటాలి బాకర్‌కు పాక్ సమన్లు జారీ చేయడం విశేషం.

# హేమంత్ సోరెన్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ..

**జేపీఎస్‌సీ పరీక్షల రద్దు నిర్ణయంపై హైకోర్టు స్టే**



న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) : జార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. జేపీఎస్‌సీ పరీక్షల్ని రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జార్ఖండ్ హైకోర్టు స్టే విధించింది. సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ దీపక్ రోషన్ గురువారం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో జేపీఎస్‌సీ పరీక్షల ద్వారా ఇటీవల నియామకమైన ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభించింది. జేపీఎస్‌సీ జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్)తోపాటు జేఎస్ఎస్‌సీ (జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్) చేపట్టిన పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ అక్కడి విద్యార్థి సంఘాలు, యువత గత నెల నుంచి పెద్ద ఎత్తున ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. కొందరు విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షలకు దిగారు. విద్యార్థి సంఘాలతోపాటు ప్రతిపక్షాలు కూడా విద్యార్థులకు మద్దతుగా నిలిచాయి. రెండేళ్లుగా ఈ రెండు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. చివరకు వారి డిమాండ్లకు తలొగ్గిన సీఎం హేమంత్ సోరెన్ ఆధ్వర్యంలోని సర్కార్ పరీక్షల్ని రద్దు చేసింది. 2024 నుంచి జేపీఎస్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలు, నియామకాల్ని రద్దు చేస్తూ ఇటీవలే నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ నిర్ణయాన్ని తాజాగా ఎంపికైన ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. జేపీఎస్‌సీ ద్వారా రెండేళ్లుగా దాదాపు 39 ఉద్యోగ నియామక పరీక్షలు జరిగాయి. వాటిలో కొన్ని ఫలితాలు వెలువడి నియామకాలు కూడా పూర్తయ్యాయి. వేలాది మంది ఉద్యోగాల్లో చేరిపోయారు. జేపీఎస్‌సీ ప్రక్రియ ద్వారా ఎన్నికై.. ఏడాది, రెండేళ్ల నుంచి ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం ఈ పరీక్షల్ని, నియామకాల్ని రద్దు చేయడంతో వారి ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వచ్చింది.

# క్యాన్సర్ వ్యాక్సిన్‌లో పురోగతి


**-మోడర్నా, మెర్క్ టీకా**
**-ఎంఆర్ఎన్ఏ ఆధారిత చికిత్సతో సానుకూల ఫలితాలు**




**న్యూఢిల్లీ,** ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) : క్యాన్సర్ వ్యాక్సిన్‌లు ఆకర్షణీయమైన వాగ్దానాల్ని అందిస్తున్నాయి. అయితే అవి ఆచరణాత్మకంగా రోగులకు అందుబాటులోకి రావడం లేదు. ఈ క్రమంలో మోడర్నా, మెర్క్ సంస్థల పరిశోధన ఆశాజనకంగా కన్పిస్తున్నది. క్యాన్సర్ కణాలన్నింటిపై విచక్షణారహితంగా దాడి చేయడానికి బదులుగా ఒక రోగిని వేధిస్తున్న నిర్దిష్ట క్యాన్సర్‌ను గుర్తించి, దానిని నాశనం చేసేలా రోగ నిరోధక వ్యవస్థకు శిక్షణ ఇవ్వగలమా? అన్న ఆలోచనపై ఒక ముందడుగు పడింది. మోడర్నా, మెర్క్ సంస్థలు అభివృద్ధి చేసిన వ్యక్తిగతీకరించిన ఎంఆర్ఎన్ఏ ఆధారిత క్యాన్సర్ చికిత్సపై నిర్వహించిన భారీ ఫేజ్ 3 క్లినికల్ ట్రయల్స్‌లో సానుకూల ఫలితాలు వచ్చాయి. ఈ ట్రయల్‌లో వ్యక్తిగతీకరించిన వ్యాక్సిన్‌ను ఇప్పటికే క్యాన్సర్ చికిత్సలో ఉపయోగిస్తున్న పెంబ్రోలీజుమాబ్ అనే ఇమ్యునోథెరపీ మందుతోపాటు ఇచ్చారు. దీనిని పెంబ్రోలీజుమాబ్ ఒక్కటే ఇచ్చిన చికిత్సతో పోల్చారు. ఈ అధ్యయనంలో పూర్తిగా శస్త్రచికిత్స ద్వారా తొలగించిన ఫేజ్ 2బీ ఐఐబీ-ఐవీ మెలనోమా ఉన్న 1,137 మంది పాల్గొన్నారు. గతంలో ఈ విధానంపై ఆసక్తిని పెంచిన 2బీ అధ్యయనం కంటే ఇది చాలా పెద్దస్థాయి పరీక్ష. అయితే నియోయాంటిజెన్ క్యాన్సర్ వ్యాక్సిన్ అంటే అది ఎలా పనిచేస్తుంది, ఈ విధానం చివరికి క్యాన్సర్ చికిత్సను మార్చగలదా? అన్నది త్వరలోనే తేలుతుంది. ఈ మోడర్నా-మెర్క్ వ్యాక్సిన్ ఎలా పనిచేస్తుందంటే.. పేషంట్ ట్యూమర్‌ను తొలగించిన తర్వాత ఈ థెరపీ ప్రారంభం అవుతుంది. సర్జరీ అనంతరం మెలనోమాను తొలగించిన తర్వాత లక్ష్యాలుగా ఉపయోగపడ గల మ్యుటేషన్‌లను గుర్తించి ఆ ట్యూమర్‌ను జన్యు విశ్లేషణ చేస్తారు. తర్వాత ఆ వ్యక్తి కణితి నుంచి ఎంపిక చేసిన నియోయాంటిజెన్‌లను సంకేతపర్చడానికి ఒక వ్యక్తిగతీకరించిన ఎంఆర్ఎన్ఏ టీకాను తయారు చేస్తారు.

# హొర్ముజ్ జలసంధిలో అమెరికా రహస్య కారిడార్

వాషింగ్టన్ ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) : ఇరాన్ యుద్ధ ప్రతిష్టంభన కొనసాగుతున్నప్పటికీ, హొర్ముజ్ జలసంధి గుండా రోజుకు లక్షలాది బ్యారెళ్ల చమురును రవాణా చేసేందుకు అమెరికా సైన్యం రహస్యంగా ఒక షిప్పింగ్ కారిడార్‌ను ఏర్పాటు చేసిందని ఇద్దరు అమెరికా అధికారులను ఉటంకిస్తూ 'ఆక్సియోస్' తెలిపింది. హొర్ముజ్ జలసంధి తెరిచే ఉందని, ఈ కీలకమైన మార్గంపై అమెరికాకు పూర్తి నియంత్రణ ఉందని పేర్కొంటూ, ఇరాన్‌తో చేసుకున్న 60 రోజుల స్వల్పకాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించడాన్ని ట్రంప్ తోసిపుచ్చిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది.



జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక


# గడువు తీరిన మసాలాల విక్రయాలు.. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

**- అంబర్‌పేట కిరాణా దుకాణంలో ప్రశ్నించిన కస్టమర్‌పై దురుసు ప్రవర్తన.. ఆధారాలతో వీడియో రికార్డింగ్**

**హైదరాబాద్, అంబర్‌పేట:**
నగరంలోని కొన్ని కిరాణా దుకాణాల్లో గడువు తీరిన మసాలా ఉత్పత్తులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అంబర్‌పేట ప్రాంతంలోని ఓ కిరాణా దుకాణంలో గడువు ముగిసిన మసాలా ఉత్పత్తుల విక్రయాలపై కస్టమర్ ప్రశ్నించడంతో వివాదం చోటుచేసుకున్నట్లు సమాచారం.
కస్టమర్ కథనం ప్రకారం.. దుకాణంలో విక్రయిస్తున్న మసాలా ఉత్పత్తుల గడువు తేదీపై అనుమానం రావడంతో ఆయన దుకాణ నిర్వాహకులను ప్రశ్నించారు. అయితే సరైన సమాధానం ఇవ్వకుండా "ఆడవాళ్లతో మాట్లాడటం ఇదేనా?" అంటూ తనపై దురుసుగా మాట్లాడారని, అనంతరం దౌర్జన్యానికి ప్రయత్నించినట్లు కస్టమర్ ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను కస్టమర్ తన చరవాణిలో వీడియోగా రికార్డు చేసినట్లు తెలిపారు. గడువు ముగిసిన ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయా? లేదా? అనే అంశంపై సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.




**ఫుడ్ సేఫ్టీ అధికారులపై ప్రశ్నలు**
గడువు తీరిన ఆహార పదార్థాల విక్రయాలపై నిఘా పెట్టాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో ఎంతవరకు తనిఖీలు నిర్వహిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నగరంలోని కిరాణా దుకాణాల్లో ఆహార ఉత్పత్తుల నాణ్యత, గడువు తేదీలు, నిల్వ విధానాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.
ఇదిలా ఉండగా, ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను మరింత పటిష్టం






చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసే దిశగా కసరత్తు చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. గడువు తీరిన ఆహార పదార్థాలను విక్రయించడం నిజమైతే సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి





**జర్నలిస్ట్ డైరీ పరిగి ఆగస్టు 20**
భారతదేశాన్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 21వ శతాబ్దపు అగ్రగామి దేశంగా తీర్చిదిద్దేందుకు మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ చేసిన సేవలు దేశ ప్రజలకు ఎప్పటికీ చిరస్మరణీయమని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం న్యూఢిల్లీలోని 'వీర్ భూమి' వద్ద రాజీవ్ గాంధీ సమాధిని ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి సందర్శించి, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సమాచార విప్లవానికి నాంది పలికిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశంలో సాంకేతిక రంగం, టెలికమ్యూనికేషన్స్, ఆధునిక విద్య విస్తరణ, గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల సాధికారత కోసం పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి రంగాల్లో ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు భారతదేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేశాయని పేర్కొన్నారు. 'యువతే దేశ భవిష్యత్తు' అనే గొప్ప దృక్పథంతో యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు, వారి ఉన్నతికి రాజీవ్ గాంధీ చూపిన మార్గం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలి

**- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆదేశాల మేరకు అధికారులకు వినతిపత్రం**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూర్ మండలం సిద్దాపూర్ గ్రామంలో సుమారు 86 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (డంపింగ్ యార్డ్) ప్రతిపాదనను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు కొత్తూర్ తహశీల్దార్ మరియు షాద్‌నగర్ ఆర్డీవో గార్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం జారీ చేసిన G.O.Rt.No.641, తేదీ 02-07-2026 ద్వారా సిద్దాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 252, 278, 361లోని భూమిని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సదుపాయాల కోసం వినియోగించేందుకు నిర్ణయం తీసుకున్న విషయాన్ని వినతిపత్రంలో ప్రస్తావించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో సిద్దాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, భూగర్భ జలాలు, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానిక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే సమీపంలోని అటవీ ప్రాంతాలు, వన్యప్రాణులు, గ్రీన్ కారిడార్, గిరిజన ఆవాసాలు, విద్యా మరియు ఆధ్యాత్మిక సంస్థలకు కూడా ముప్పు





ఏర్పడే అవకాశం ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా సిద్దాపూర్ ప్రాంతంలో ఉన్న HPCL LPG పైప్‌లైన్ మరియు సెక్షనలైజింగ్ వాల్వ్ స్టేషన్ వంటి కీలక మౌలిక వసతుల భద్రతపై కూడా సమగ్ర అధ్యయనం నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇంత పెద్ద స్థాయిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సరికాదని, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను నిలిపివేసి, సమగ్ర శాస్త్రీయ, పర్యావరణ అధ్యయనాలు నిర్వహించి నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని నాయకులు అధికారులను కోరారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగించే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పెంటనోళ్ళ యాదగిరి, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, సర్పంచ్ లలిత గోపాల్ నాయక్, మాజీ సర్పంచులు మిట్టు నాయక్, రమేష్, మాజీ ఎంపీటీసీ వడ్డె బాలయ్య, మాజీ కౌన్సిలర్ ప్రసన్నలత యాదయ్య, నాయకులు రవి కుమార్, బుచ్చిబాబు, రాములు నాయక్, లక్ష్మణ్ నాయక్, కోట్య నాయక్, జంగయ్య, గోపి నాయక్, బిచ్య నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పోలే శివకుమార్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**యాచారం (ఆగస్టు 20)(జర్నలిస్ట్ డైరీ )**
ఇటీవల మరణించిన కొత్తపల్లి గ్రామానికి చెందిన పోలే శివకుమార్ కుటుంబానికి తెలంగాణ పోలే వారి ఫ్యామిలీ సంఘం ఆధ్వర్యంలో రూ. 13,400 ఆర్థిక సహాయం అందజేశారు. శివకుమార్ కుటుంబం ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, వారికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సభ్యులు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు పోలే మైబయ్య (మాల్), కొత్తపల్లి గ్రామ వాస్తవ్యులు పోలే పెద్ద రాములు, పోలే చంద్రయ్య, పోలే సాయిబాబా, పోలే శివ, పోలే ప్రశాంత్, తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన పోలే జంగయ్య, కొల్‌కుల్‌పల్లి గ్రామానికి చెందిన పోలే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలు అవసరంలో ఉన్న కుటుంబాలకు ఎంతో భరోసానిస్తున్నాయని పేర్కొన్నారు.

# రూ.5,00,000/- ఐదు లక్షల రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్వోసీ ని అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) :**
వేంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని పాపారాయుడు కాలనీ కి చెందిన శ్రీమతి గోన సరస్వతి గారికి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 5,00,000/- ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో శ్రీచికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో నాయకులు నాయి నేని చంద్రకాంత్ రావు,పోతుల రాజేందర్, భాస్కర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తారా?

**-జీవో 97ను వెంటనే రద్దు చేయాలి**
**-పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర**
**-విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం విరమించుకోవాలి**
**-మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) :**
పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన GO 97ను వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యపై ఆధారపడుతున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసేలా ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా అన్ని వర్గాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తున్నారని, డిప్లమా పూర్తి చేసిన వారికి సాంకేతిక రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. అలాంటి విద్యా వ్యవస్థను



బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా +Ⴄ 97 తీసుకురావడం విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యా పరిధిలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యూనివర్సిటీల పరిధిలోకి మార్చే ప్రయత్నాలు చేయడం ద్వారా పాలిటెక్నిక్ కోర్సులను క్రమంగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించకుండా పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థనే దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన ఆలోచనా విధానాన్ని మార్చుకొని +Ⴄ 97ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే, విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అవసరమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అంజయ్య యాదవ్ హెచ్చరించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# మునుగోడులో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**మునుగోడు, ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి, దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని తెలిపారు. దేశంలో సాంకేతిక రంగం అభివృద్ధికి, ముఖ్యంగా కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల విస్తరణకు ఆయన వేసిన బాటలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో యువతకు మరింత ప్రాధాన్యత కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని కొనియాడారు.దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు అన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో జల వెంకన్న, మాధగోని రాజేష్, జక్కలి ఐలయ్య, అద్దంకి రామలింగం, ఆరేళ్ల సైదులు, దండు లింగస్వామి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్‌బీఐ బేసిక్ సేవింగ్స్ ఖాతాదారులకు ముఖ్య సమాచారం

**మునుగోడు ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** ప్రజలకు ముఖ్య గమనిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (BSBD) ఖాతాలకు సంబంధించిన నగదు ఉపసంహరణ ఛార్జీలను సవరించింది. ఈ సవరించిన ఛార్జీలు 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి.కొత్త నిబంధనల ప్రకారం దీూదీణ ఖాతాదారులకు నెలలో నాలుగు నగదు ఉపసంహరణ లావాదేవీలు ఉచితంగా కొనసాగుతాయి. అయితే నెలలో నాలుగుకు మించి నగదు ఉపసంహరణలు చేసినట్లయితే, అదనంగా చేసే ప్రతి లావాదేవీపై రూ.15 ం GST చొప్పున ఛార్జీ విధించబడుతుంది.
అయితే ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బ్యాంకు తెలిపింది. డిజిటల్ లావాదేవీలు ఎలాంటి పరిమితి లేకుండా ఉచితంగానే కొనసాగుతాయి. అందువల్ల ఖాతాదారులు నగదు లావాదేవీల అవసరాన్ని తగ్గించి, సాధ్యమైనంత వరకు డిజిటల్ చెల్లింపు విధానాలను వినియోగించుకోవాలని సూచించింది.
ఈ మార్పులను దీూదీణ ఖాతాదారులు గమనించి, నగదు ఉపసంహరణ లావాదేవీల విషయంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని బ్యాంకు సూచించింది.

## భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 20:- (జర్నలిస్ట్ డైరీ) :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో భారత రత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాచకొండ జంగయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గ్రామంలో పాఠశాల విద్యార్థులకు అంగన్వాడి కేంద్ర విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్లు, పలకలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. దేశానికి ఆధునిక పరిజ్ఞానాన్ని కంప్యూటర్ ఐటీ రంగాన్ని పరిచయం చేసిన మహానేత అని 18 సంవత్సరాల వయసుకి ఓటు కల్పించిన గొప్ప నేత అని కొనియడారు. భవిష్యత్తులో విద్యావ్యవస్థలు బలపేతం చేయడానికి ఆరోజుల్లోనే ముందు చూపుతో ఆలోచించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాచకొండ జంగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంగన్వాడీ టీచర్ నీళ్ల వసంత, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు రాచకొండ శ్రీను, బాలగోని మల్లేష్, గ్రామపంచాయతీ రెండవ వార్డ్ మెంబర్ బాలగోని మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల చంద్రయ్య, ఐఎన్టీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రాచకొండ లింగస్వామి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పంగరేక్క యాదగిరి, మార్ల గణేష్, కోడూరి సంపత్, రాచకొండ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువత సాంకేతిక చరిత.. మా రాజీవ్ గాంధీ ఘనత






**-షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**
**-రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఘన నివాళి..**
**-ఆసుపత్రిలో రోగులకు సేవలు..**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 20 (జర్నలిస్ట్ డైరీ) :** నేటి యువత సాంకేతిక చరిత మా రాజీవ్ గాంధీ ఘనత.. భారతావనికి సరికొత్త సాంకేతిక దిశా నిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్.. అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొరియాడారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఫరూక్ నగర్ మండల కేంద్రంలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రక్షక భటులే భక్షకభటులై అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని పొట్టలో పెట్టుకున్న తరుణంలో పైలట్ గా స్వయం ఉపాధితో జీవనం గడుపుతున్న రాజీవ్ గాంధీ ప్రజల కోరికతో, పార్టీ కోరికతో రాజకీయాలకు వచ్చి ప్రధానమంత్రిగా అనతి కాలంలోనే సాంకేతిక విప్లవం తెచ్చి దేశానికి కొత్త దిశను చూపించాడని ప్రశ్నించారు. నేడు యువత జీవితంలో భాగంగా మారిన సెల్ఫోన్, కంప్యూటర్ వంటివి రాజీవ్ గాంధీ సాధించిన ఘనతలు అని కొనియాడారు. ఈరోజు గ్రామీణ ప్రాంతంలో కూలి పని చేసే వాళ్ళ దగ్గర కూడా సెల్ ఫోన్ ఉందని, అది మాజీ ప్రధాని రాజీవ్ వల్లనే సాధ్యమైందని అభినందించారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, శ్రీధర్, ఇబ్రహీం, పులిమామిడి శ్రీశైలం, ముబారక్ ఖాన్, ఖదీర్, చందు, అశోక్, కత్తి చంద్రశేఖర అప్ప, గడ్డం శ్రీనివాస్ యాదవ్, సింగపాగ అనిల్, ఉప సర్పంచ్ సీతారాం, మంగలి శ్రీశైలం, జయప్రకాష్ గౌడ్, గుట్ట రాజు, సాదిక్, బీరప్ప, ఇసాక్, మాధవులు, తంగిడిపల్లి శంకర్, రవితేజ, మహేందర్, మంగ అశోక్, సాయి, చందులాల్ తదితరులు పాల్గొన్నారు..

# కాజీపేటలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి: ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**రైల్వే జీఎంను కలిసి వినతిపత్రం అందజేసిన వరంగల్ ఎంపీ**




Dr. KADIYAM KAVYA
MBBS, MD
MEMBER OF PARLIAMENT
(LOK SABHA)
Warangal IC-399
MEMBER :
Standing Committee on Health and Family Welfare.
Consultative Committee on Skill Development & Entrepreneurship.
National Assisted Reproductive Technology and Surrogacy Board.
Committee on Empowerment of Women (2025-26)

403-Narmada, MP Flats, Dr BD Marg Area,
New Delhi Pin Code:110001,
Constituency Address:
H.No. 2-7-1041/3, Road No. 2 Kanakadurga
Colony, Waddepally, Hanumakonda - 506370,
Hanumakonda District Telangana.
email: drkadiyamkavyampwgl@gmail.com
Mobile: 9885856065, 9491746065

Lr.MP(WGL)TELANGANA/85/2026 Date: 20.08.2026

Respected Sir,

Sub:- SCR RAILWAY DIVISION - formation of a new Railway Division in view of recent changes in divisional jurisdictions - reg.

-o0o-

I am representing Warangal Parliamentary Constituency, which is located in South Central Railway where the allocations and the responsibility have shoulder us for the development and the welfare of the public in this country especially for our zone at Warangal Parliamentary Constituency. This division comprises of Secunderbad - Balarshah, Secunderabad Vijayawada sections, of which there is a major connectivity of Kazipet Junction, which has earmarked the largest and the important junction in this Division, but it is unfortunate to express that this junction has not amicably given priority in the development since all these years.

My Parliament Constituency (Warangal) has the jurisdiction from Raghunathpally station to Kazipet Junction, Kazipet junction to Hasanparthy and Kazipet junction to Chinthalapally in Secunderabad division.

I would like to bring it to your kind notice that the formation of Kazipet Division on S.C. Railway has been a long pending demand of both railway employees and also from the Rail users both freight and passenger, is still pending.

Now the Government of India has decided to make partial modification of the earlier decision of the Cabinet dated 28.02.2019 by revising the divisional jurisdiction with formation of a new Railway Zone with Visakhapatnam as Zonal Headquarters and a new Rayagadh Division and the railway board has requested the GM, South central railway to submit the detailed project report. We are sorry to note that while the Government taking this decision has omitted the long pending issue of Kazipet Division and its appears that there is no proposal for forming a new Division with the Ministry of Railways in spite of continuous agitations since a long time, even though the demand for Kazipet Division is there much prior to the subject of Visakhapatnam zone.

With new zone coming up there is every justification for forming another Division on S.C. Railway because Vijayawada, Guntur and Guntakal Divisions which are now on South Central Railway will be merged into the new Visakhapatnam Zone leaving only Secunderabad, Hyderabad and Nanded Divisions for S.C. Railway.

I further submit that, almost 48.6% earnings are coming from Kazipet region. Ballarshah Kazipet Karimnagar, Kazipet Vijayawada Jaggayyapet Dornakal Bhadrachalam raod Manuguru, sections are potential earning centers with Coal mines, thermal stations,

Contd..2

**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య కోరారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలో జనరల్ మేనేజర్‌ను స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను, ఈ ప్రాంతానికి ఉన్న రైల్వే ప్రాధాన్యతను జీఎంకు వివరించారు.కాజీపేట జంక్షన్ దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత కీలకమైన జంక్షన్‌గా ఉన్నప్పటికీ, దానికి తగిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య పేర్కొన్నారు. కాజీపేట కేంద్రంగా ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉందని, రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులు, రైల్వే వినియోగదారులు కూడా ఈ డిమాండ్‌ను కోరుతున్నారని తెలిపారు.
ఇటీవల రైల్వే జోన్లు, డివిజన్లపునర్వ్యవస్థీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో కాజీపేట డివిజన్ అంశాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త రైల్వే జోన్, డివిజన్ల ఏర్పాటు జరుగుతున్న సమయంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కాజీపేటను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేస్తే పరిపాలనా సామర్థ్యం పెరగడంతో పాటు రైల్వే కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని వివరించారు.రైల్వే ఆదాయంలో కాజీపేట ప్రాంతానికి కీలకమైన వాటా ఉందని ఎంపీ తెలిపారు. బల్లార్షా--కాజీపేట, కాజీపేట--విజయవాడ, కాజీపేట--కరీంనగర్, డోర్నకల్--మణుగూరు తదితర రైల్వే మార్గాలు సరుకు రవాణాకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయని చెప్పారు. బొగ్గు, సిమెంట్, బియ్యం, మిర్చి, గ్రానైట్, ఎరువులు తదితర సరుకుల రవాణాకు ఈ ప్రాంతంలో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్‌పై రైల్వే ట్రాఫిక్‌తో పాటు పరిపాలనా భారం కూడా పెరుగుతోందని, ఈ నేపథ్యంలో కాజీపేటను కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేస్తే పనిభారం సమతుల్యం అవడంతో పాటు ఈ ప్రాంత రైల్వే అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఎంపీ డా.కడియం కావ్య అన్నారు.కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ అని, దీనిపై రైల్వే శాఖ సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎంపీ జీఎంను కోరారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.కాజీపేట డివిజన్ ఏర్పాటుతో వరంగల్--కాజీపేట ప్రాంతంలో రైల్వే మౌలిక వసతులు, ప్రయాణికుల సౌకర్యాలు, సరుకు రవాణా మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని ఎంపీ పేర్కొన్నారు.

# పేద విద్యార్థులకు తోడ్పాటు అందిస్తా: ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు




**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** చదువు తోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో పర్యటించారు.కళాశాల పరిసరాలను అధికారులతో కలిసి పరిశీలించి,పలు సూచనలు చేశారు. విద్యార్థులకు 30కుర్చీలు, 5టేబుల్స్, 3టీచర్స్ కుర్చీలనుఅందజేశారు. విద్యార్థులకు అవసరాలకు అనుగుణంగా ఫ్యాన్లు,లైట్లు కూడాత్వరలోఅందజేస్తామన్నారు. విద్యార్థిని, విద్యార్థులు బాగా చదువుకొని మంచి భవిష్యత్ లో ఉండాలి అని ఆశీర్వదించారు.విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ప్రభుత్వ విద్యాసంస్థలేనని అన్నారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ విద్య సంస్థల్లో చేరి నాణ్యమైన విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ రూములు ఉండే విధంగా ఉపాధ్యాయులు,అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేందర్ ,పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్, వర్ధన్నపేట మండల అధ్యక్షులు గోశాల వెంకన్న,ఇల్లంద మార్కెట్ చైర్మెన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ ప్రభాకర్ గౌడ్,కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి,కిమా నాయక్ ,ప్రిన్సిపాల్ సుజాత,సర్పంచ్లు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు,కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు




**రామన్నపేట ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు,పున్న జగన్ మోహన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వలిగొండ రామన్నపేట మార్కెట్ వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి,రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు, అనంతరంవారు మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు,18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా యువత రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచిన చారిత్రాత్మక నిర్ణయం రాజీవ్ గాంధీ దే అని అన్నారు,దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు తీసుకెళ్లి, ఐటీ విప్లవానికి పునాదులు వేసిన దూరదృష్టి గల నాయకుడిగా రాజీవ్ గాంధీ అని అభివర్ణించారు,అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు నేటికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు,ప్రస్తుత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల భారంలోకి నెడుతోందని, పేపర్ లీకేజీలు, నిరుద్యోగం, మత విద్వేషాలను పెంచుతోందని విమర్శించారు,యువత, పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని, ఆయన ప్రధానమంత్రి అయితే ప్రజా సంక్షేమం, అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆకాంక్షించారు,రాజీవ్ గాంధీ గారి ఆశయాలకు అనుగుణంగా 18 సంవత్సరాలు నిండిన యువతి యువకుల ఓటరు నమోదును కార్యక్రమంను ఈ సందర్భంగా ప్రారంభించారు,ఈకార్యక్రమంలో పాల్గొన్న వారు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కందిమల్ల గోపాల్ రెడ్డి, రామన్నపేట ఉపసర్పంచ్ మోటే రమేష్, వనం చంద్రశేఖర్, సాల్వేర్ అశోక్, బొడ్డు సాలయ్య,గుత్తా నర్సిరెడ్డి, మొహమ్మద్ నాసర్, బండ అంజిరెడ్డి ,జిల్లా వెంకటేశం, పిట్ట వెంకటరెడ్డి, మహమ్మద్ అక్రమ్, కోట సుధాకర్ ,బత్తుల నవీన్, ఆముద లక్ష్మణ్ ,పున్న అమరేందర్ ,ఏ పరమేష్, కొమ్ము రామస్వామి గొరిగే శేఖర్ బండ లింగస్వామి, మోటే మహేష్ ,కేశవదాస్ ,వెంకటేష్ బొడ్డు, శంకరయ్య ,ఎండి మన్సూర్ అలీ, ఎండి అజార్ ,హరిబాబు, కొండ శేఖర్ గౌడ్ ,మహమ్మద్ రిజ్వాన్, మిర్జా ఈనాయతుల్లా బేగ్, చిర్రబోయిన నవీన్ ,గంగాపురం శంకర్ ,సహదేవ ,కక్కినేని రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# నిధులు మంజూరు చేయాలని వినతి



**చిట్యాల ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** చిట్యాల చేనేత సహకార సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాలని సంఘం అధ్యక్షుడు గంజి సుధాకర్, ప్రధాన కార్య దర్శి చెరుపల్లి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములతో కలిసి మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డికి వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మిర్యాల ప్రకాష్, మిర్యాల వెంకటేశ్వర్లు, గంజి కనకయ్య గంజి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేస్తాం: కమిషనర్



**చిట్యాల ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** చిట్యాల పట్టణంలో 10వ వార్డులోని శివసాయి కాలనీలో గిఫ్ట్ ద్వారా కేటాయించిన 10శాతం భూమిని మున్సిపల్ అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కబ్జా ఆరోపణలపై కమిషనర్ గురులింగం, టౌన్ ప్లానింగ్ అధికారి, ఏఈ, వార్డు అధికారులతో స్థలాన్ని కొలిచి, రికార్డుల ప్రకారం అది 2,299 చదరపు గజాలు ఉన్నట్లు నిర్ధారించారు. మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

# పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

**-సీపీఎం పాదయాత్రను జయప్రదం చేయాలి**

**-జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్**

**రామన్నపేట ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్ ఇందిరాపార్క్ వరకు నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ పిలుపునిచ్చారు.పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను రామన్నపేటలో సీపీఎం నాయకులతో కలిసి ఆవిష్కరించి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎం.డి. జహంగీర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడి దశాబ్దం పూర్తవుతున్నప్పటికీ జిల్లాలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.జిల్లాకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని, లక్షలాది మంది చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు.సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరో గత్యంతరం లేక మూసీ నది కలుషిత నీటిని పంటలకు వినియోగిస్తూ భూములు, పంటలు కలుషితం కావడంతో పాటు ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు ప్రజల గోడు పట్టించుకోకుండా తమ చేతగానితనాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. జిల్లాకు సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చడంలో కీలకమైన బస్వాపూర్, గంధమల్ల, చర్లగూడెం తదితర ప్రాజెక్టులకు అవసరమైన నిధులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.రామన్నపేట ప్రాంతానికి ఎంతో కీలకమైన ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువల పనులు ఏళ్లు గడుస్తున్నా నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. బస్వాపూర్ రిజర్వాయర్ ద్వారా రామన్నపేట మండలానికి మూసీ నీటికి ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలను అందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎంతో పురాతనమైన ఆసిఫ్‌నగర్ కాలువను పునరుద్ధరించాలని, అర్ధాంతరంగా నిలిచిపోయిన కాలువల పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు విడుదల చేసి, కాలపరిమితితో పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రకు రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు ఇవ్వాలని, 29, 30, 31 తేదీల్లో భువనగిరి నుంచి ఇందిరాపార్క్ వరకు జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని ఎం.డి. జహంగీర్ కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య,మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,జిల్లా కమిటి సభ్యులు వనం ఉపేందర్,మండల కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి నగేష్,మండల కమిటి సభ్యులు బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, తొలుపునూరి శ్రీనివాస్, అవనగంటి నగేష్, నీల అయిలయ్య,పల్లె సత్యం, దండిగ నర్సింహా,బావండ్లపల్లి సత్యం,శానగొండ వెంకటేశ్వర్లు,వల్లమల్ల రమేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల కోసం కళను అంకితం చేసిన కారుపోతుల అంజన్న సేవలు చిరస్మరణీయం



**రామన్నపేట ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజానాట్యమండలి మాజీ జిల్లా అధ్యక్షులు, ప్రజా కళాకారులు కామ్రేడ్ కారుపోతుల అంజన్న 31వ వర్ధంతి సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కక్కిరేణి గ్రామంలో ఘనంగా నివాళులర్పించి, జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు గంటెపాక శ్రీకృష్ణ,మండల అధ్యక్షులు బర్రె మధు మాట్లాడుతూ ప్రజా కళాకారుడిగా కారుపోతుల అంజన్న ప్రజా సమస్యలను తన కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారని అన్నారు.సమాజంలోని అన్యాయాలు, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు ఆయన కళను ఒక ఆయుధంగా ఉపయోగించారని పేర్కొన్నారు."కళ కళ కోసం కాదు,కళ ప్రజల కోసం" అనే ఆశయంతో ప్రజల కోసం తన కళను అంకితం చేసిన అంజన్న సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు.ప్రజా కళాకారులకు ఆయన జీవితం, పోరాట స్ఫూర్తి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. నేటి కళాకారులు కూడా ప్రజా సమస్యలను ప్రతిబింబిస్తూ సమాజ మార్పు కోసం తమ కళను వినియోగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు మజ్జూరి సాయి, రామన్నపేట మండల కమిటీ సభ్యులు కానుకుంట్ల ఉప్పలయ్య, మచ్చగిరి, వెంకన్న, లింగస్వామి, చరణ్, లోకేష్, బూడిద ఆది తదితరులు పాల్గొని కామ్రేడ్ కారుపోతుల అంజన్నకు ఘన నివాళులు అర్పించారు.

# కార్మికులకు అండగా ఏఐటీయూసీ జెండా

## - నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్**

**వలిగొండ, ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు.వలిగొండ మండల కేంద్రంలోని దేవి శ్రీ గార్డెన్స్‌లో చొప్పరి వెంకటేశం అధ్యక్షతన గురువారం ఏఐటీయూసీ మండల 3వ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను బలహీనపరిచే విధంగా ఉన్నాయని విమర్శించారు. కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను హరించే ఈ లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని ప్రదేశాల్లో రక్షణతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్,




ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.
కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, ఆటో కార్మికులు, పారిశ్రామిక కార్మికులు, స్కీం వర్కర్లు తదితర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. పెరుగుతున్న పని భారాన్ని తగ్గించి, ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 26న భువనగిరిలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభను విజయవంతం చేయాలని, జిల్లాలోని కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, సీపీఐ సీనియర్ నాయకులు ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య, సల్వాదిరి రవీందర్, బొడిగ సుదర్శన్, సుద్దాల సాయికుమార్, ఏఐటీయూసీ నాయకులు కనకబోయిన ఆంజనేయులు, కందుకూరి సంజీవ, నానంచర్ల వెంకటేష్, ఐలపాక స్వామి, గడ్డల నరసింహ, బొలుగుల రామ్మూర్తి, కసరబోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూమిని యథాతథంగా అప్పగించాలి:గుత్తా



**చిట్యాల ఆగస్టు 20 (జర్నలిస్ట్ డైరీ) :** చిట్యాల టీటీడీ కళ్యాణమండపం భూ వివాదంపై శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం జరిగింది.కళ్యాణమండపం కోసం గతంలో కొనుగోలు చేసిన ఎకరం 12 గుంటల భూమిని యథాతథంగా అప్పగించాలని గుత్తా స్పష్టం చేశారు. తహశీల్దార్, సర్వేయర్, మున్సిపల్ కమిషనర్ సంయుక్తంగా సర్వే చేసి భూమిని ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పురపాలక ఛైర్మన్ పందిరి గీతా రమేష్, వైస్ ఛైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మీ సైదులు,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,మాజీ ఏం సి ఛైర్మన్ పందిరి శ్రీనివాస్,కనకదుర్గ గుడి ఛైర్మన్ మారగొని ఆంజనేయులు గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎద్దులపూరి కృష్ణ,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం,సిపిఎం పార్టీ నాయకులు జిట్టా నగేష్,అవిశెట్టి శంకరయ్య, కోమటిరెడ్డి నరసింహారెడ్డి,మాస శ్రీనివాస్,కూరెళ్ళ శ్రీను,పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు

## గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

**ఈ-కేవైసీ గడువు పొడిగింపు!**



ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్. కేంద్ర ప్రభుత్వం, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈ-కేవైసీ పూర్తి చేసుకునే గడువును ఆగస్టు 31 వరకు పొడిగించినట్టు సమాచారం. తొలుత ఆగస్టు 16ను గడువుగా నిర్ణయించినప్పటికీ సర్వర్ సమస్యలు, ఓటీపీ ఆలస్యం, బయోమెట్రిక్ ఇబ్బందుల కారణంగా పలువురు కస్టమర్లు కేవైసీ పూర్తి చేయలేకపోవడంతో అదనపు సమయం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇండేన్, భారత్ గ్యాస్, హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు సమీప ఏజెన్సీలో ఉచితంగా కేవైసీ చేయించుకోవచ్చు. అధికారిక యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఈ ప్రక్రియ పూర్తి చేసుకునే అవకాశం ఉంది. చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా కేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

## పసిడి ధరలు మరోసారి పైపైకి.. వెండి కిలోకు రూ.10 వేల పెరుగుదల



హైదరాబాద్:
బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో గురువారం విలువైన లోహాల ధరలు గణనీయంగా ఎగబాకాయి. ముఖ్యంగా బంగారం ధర ఒక్కరోజులోనే రూ.4 వేలకుపైగా పెరగడం, వెండి ధర కిలోకు ఏకంగా రూ.10 వేల మేర పెరగడంతో కొనుగోలుదారులపై అదనపు భారం పడింది. ఇప్పటికే అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్న పసిడి ప్రియులకు తాజా పెరుగుదల మరింత షాక్ ఇచ్చింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.4,300 పెరిగింది. దీంతో 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,270కి చేరింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగా పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.3,950 పెరిగి రూ.1,46,000 వద్ద కొనసాగుతోంది. బంగారం ధరలు ఈ స్థాయికి చేరడంతో వివాహాలు, శుభకార్యాల కోసం ఆభరణాలు కొనుగోలు చేయాల్సిన కుటుంబాలపై ఖర్చు మరింత పెరగనుంది. మరోవైపు వెండి ధరలోనూ భారీ పెరుగుదల నమోదైంది. కిలో వెండి ధర ఒక్కరోజులోనే రూ.10,000 పెరగడంతో రూ.2,60,000కి చేరింది. వెండిని ఆభరణాలు, గృహోపకరణాలతో పాటు వివిధ పారిశ్రామిక అవసరాలకు కూడా ఉపయోగిస్తుండటంతో ధరల పెరుగుదల మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. బంగారం, వెండి ధరలు ఒకేసారి పెరగడంతో బులియన్ మార్కెట్‌లో కొనుగోలుదారులు తాజా రేట్లను పరిశీలిస్తూ ముందుకు సాగుతున్నారు.

## భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్..

**- సెన్సెక్స్ 628 పాయింట్లు, నిఫ్టీ 153 పాయింట్లు లాభం**



భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీ లాభాల్లో ముగిసింది. వరుసగా ఏడు రోజులుగా కొనసాగిన నష్టాలకు ఈ రోజు బ్రేక్ పడింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 628 పాయింట్లు లాభపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 153 పాయింట్లు లాభపడింది. ఐటీ, ఫైనాన్సియల్ స్టాక్స్ భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే సాగింది. గరిష్టంగా 77,611.11 పాయింట్లను తాకింది. చివరకు 628.04 పాయింట్లు (0.82%) లాభంతో 77,537.72 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 153.55 పాయింట్ల (0.64%) లాభంతో 24,231.85 వద్ద ముగిసింది. బీఎస్ఈ 30 షేర్ ఇండెక్స్‌లో ఐటీసీ, కోటక్ బ్యాంక్, ఎటర్నల్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫినాన్స్ షేర్లు లాభపడ్డాయి. వీటిలో ఎటర్నల్ 2 శాతం పైగా లాభపడింది. మరోవైపు టైటాన్, ఇండిగో, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 షేర్లు 0.68 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ షేర్లు 2.13 శాతం లాభపడగా, నిఫ్టీ కెమికల్స్ మ ఆత్రం 0.50 శాతం నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 93.94 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,490.60 వద్ద ట్రేడవుతోంది. రూపాయితో డాలర్ మారకం విలువ 95.71గా ఉంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి అత్యధికంగా 5.74 శాతం లాభపడింది. జపాన్ నిక్కీ 225, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్ ఇండెక్స్ కూడా లాభాల్లోనే కొనసాగుతున్నాయి.

## స్పోర్ట్స్

# సచిన్ రికార్డును సమం చేసిన జో రూట్

-టెస్టుల్లో అత్యధికంగా 68 ఫిఫ్టీలు కొట్టిన రూట్
-పాకిస్థాన్‌తో తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఘనత



ఆధునిక టెస్ట్ క్రికెట్‌లో తన సూపర్ ఫామ్‌తో పరుగుల వరద పారిస్తున్న ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ మరో మైలురాయిని అధిగమించాడు. టెస్ట్ ఫార్మాట్‌లో అత్యధిక అర్ధశతకాలు సాధించిన బ్యాటర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును రూట్ సమం చేశాడు. సచిన్ తన సుదీర్ఘ టెస్ట్ కెరీర్‌లో సాధించిన 68 హాఫ్ సెంచరీల రికార్డును సమం చేస్తూ, రూట్ తన 68వ అర్ధశతకాన్ని నమోదు చేసి ఆల్-టైమ్ చారిత్రాత్మక రికార్డులో భాగమయ్యాడు. పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో అతడు ఈ రికార్డు బద్దలు కొట్టాడు. ఈ సరికొత్త రికార్డుతో జో రూట్ క్రికెట్ ప్రపంచంలోని ఎంతోమంది దిగ్గజ బ్యాటర్లను వెనక్కి నెట్టేశాడు. విండీస్ లెజెండ్ శివనారాయణ్ చంద్రపాల్ (66 హాఫ్ సెంచరీలు), భారత మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రవిడ్ (63), ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అలన్ బోర్డర్ (63), రికీ పాంటింగ్ (62), సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ జాక్వెస్ కల్లిస్ (58), ఇంగ్లాండ్ మాజీ సారథి అలిస్టర్ కుక్ (57) సాధించిన 50ల రికార్డులను రూట్ ఇప్పటికే దాటేశాడు. ప్రస్తుతం సచిన్‌తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్న రూట్, మరొక్క హాఫ్ సెంచరీ సాధిస్తే టెస్టుల్లో అత్యధిక అర్ధశతకాలు చేసిన ఏకైక బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించనున్నాడు. సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 15,921 పరుగుల టెస్ట్ రికార్డును బద్దలు కొట్టే దిశగా సాగుతున్న ఏకైక సమకాలీన ఆటగాడిగా జో రూట్ విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్నాడు. ఏళ్ల తరబడి నిలకడైన ప్రదర్శన కనబరుస్తూ, రెడ్ బాల్ క్రికెట్‌లో ఇంగ్లాండ్ జట్టుకు ప్రధాన బ్యాక్‌బోన్‌గా మారిన రూట్, పరిస్థితులు ఏవైనా పరుగులు సాధించడంలో సరిసాటి లేని వేగాన్ని చూపుతున్నాడు. అర్ధశతకాలను భారీ సెంచరీలు, డబుల్ సెంచరీలుగా మలచడంలోనూ అతడు ఆరితేరిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. ఇక జో రూట్ టెస్ట్ కెరీర్ పరుగుల ప్రొఫైల్‌ను పరిశీలిస్తే, ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రధాన జట్లపై అతడు అత్యుత్తమ రికార్డును కలిగి ఉన్నాడు. ముఖ్యంగా టీమిండియాపై ఏకంగా 3,383 పరుగులు సాధించాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియాపై 2,828 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌పై 2,096 పరుగులు, పాకిస్థాన్‌పై 1,524 పరుగులు, వెస్టిండీస్‌పై 1,513 పరుగులు రాబట్టాడు.

## కొలంబో టెస్టుకు కొత్త అస్త్రం..
# 33 ఏళ్ల ఆల్‌రౌండర్ అరంగేట్రం..!



గాలే టెస్టులో భారీ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆశల్నీ సజీవంగా ఉంచుకున్న భారత జట్టు.. సిరీస్‌పై కన్నేసింది. స్పిన్ అస్త్రంతో దెబ్బతీయానుకున్న శ్రీలంకను చిత్తుగా ఓడించిన టీమిండియా కొలంబో లోనూ చెలరేగాలని భావిస్తోంది. అరంగేట్రం మ్యాచ్‌లోనే మానవ్ సుతార్ 10 వికెట్లతో ఆకట్టుకోగా.. రెండో టెస్టులో ప్రయోగాలకు సిద్ధమవుతోంది భారత్. ఈసారి స్క్వాడ్‌లోని మరో ఆల్‌రౌండర్ డెబ్యూట్ క్యాప్ అందుకుంటాడని సమాచారం. శ్రీలంక పర్యటనను విజయంతో ఆరంభించిన భారత జట్టు రెండో టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది. దేవ్‌దత్ పడిక్కల్ శతకమోత, ఆపై మానవ్ సుతార్ తిప్పేయడంతో అలవోకగా గెలుపొందిన టీమిండియా.. కొలంబోలో మరో స్పిన్ అస్త్రాన్ని ఉపయోగించనుంది. ఎడమ చేతివాటం స్పిన్నరైన 33 ఏళ్ల సరాన్ష్ జైన్ ఈ మ్యాచ్‌తో టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. దేశవాళీలో మధ్యప్రదేశ్ తరఫున అద్భుతంగా రాణించిన జైన్ గాయపడిన వాషింగ్టన్ సుందర్ స్థానంలో స్క్వాడ్‌లోకి వచ్చాడు. ప్రతిభావంతుడైన అతడికీ అవకాశం ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. జైన్‌ను ఆడించాలనుకుంటే తుది జట్టు నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించాల్సి వస్తుంది. గాలే టెస్టులో ఈ చైనామన్ బౌలర్ 25 ఓవర్లలో 103 పరుగులిచ్చి ఒకటే వికెట్ తీశాడు. దాంతో.. కుల్దీప్‌ను పక్కనపెట్టడం దాదాపు ఖాయం అనిపిస్తోంది. ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు జరుగనుంది.

## కొలంబో టెస్టుకు కీలక మార్పులు..

**- ఆ ఇద్దరిని తీసుకున్న శ్రీలంక..!**



స్వదేశంలో భారత జట్టు చేతిలో కంగుతిన్న శ్రీలంక సిరీస్ సమం చేయాలనే కసితో ఉంది. గాలే టెస్టు ఓటమి.. ఇద్దరు కీలక ఆటగాళ్లకు గాయాల నేపథ్యంలో కొలంబో టెస్టుకు కీలక మార్పులు చేసింది లంక. ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన దినేశ్ చండీమాల్, కమిందు మెండిస్‌కు విశ్రాంతినిచ్చింది. గాలే టెస్టులో 165 పరుగుల ఓటమితో కొలంబోలో విజయమే లక్ష్యంగా పెట్టుకుంది శ్రీలంక. సిరీస్ సమం చేయాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో రెండు కీలక మార్పులు చేసింది ఆతిథ్య జట్టు. నాలుగో రోజు ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన దినేశ్ చండీమాల్.. తొడ కండరాల గాయంతో ఇబ్బంది పడుతున్న కుశాల్ మెండిస్‌ను పక్కన పెట్టేసింది. కొలంబో టెస్టు కోసం వీరిద్దరి బదులు ఆల్‌రౌండర్ కమిల్ మిశ్రా, సహన్ అరాచ్చిగేలను స్క్వాడ్‌లోకి తీసుకుంది లంక. సొంతగడ్డపై నిర్వహించే లంక ప్రీమియర్ లీగ్‌లో మెరిసిన మిశార తుది జట్టులో ఉండే అవకాశముంది. అయితే.. ఓపెనర్ పథుమ్ నిశాంక కూడా ఈ మ్యాచ్‌కు డౌటే అనిపిస్తోంది. ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు మొదలవ్వనుంది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



గ్లామర్‌తో మతిపోగొడుతున్న ప్రీతి ముకుందన్..


# శర్వానంద్ 'భోగి' సినిమా విడుదల వాయిదా..

## అసలు కారణం ఇదే!




టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వాస్తవానికి ఆగస్టు 28న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా చిత్ర యూనిట్ నుంచి వెలువడిన సమాచారం ప్రకారం ఈ సినిమా అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు రావడం లేదు. వీఎఫ్ఎక్స్ పనులకు మరింత సమయం పడుతుండటంతో ఈ సినిమా విడుదలను వాయిదా వేసినట్లు తెలుస్తుంది. సినిమాలోని విజువల్ స్కేల్, పీరియడ్ వరల్డ్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లను ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమంగా తీర్చిదిద్దే ఉద్దేశంతోనే ఈ వాయిదా వేసినట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ పనులు పూర్తిగా పూర్తయిన తర్వాత కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. 1960ల నాటి ఉత్తర తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో ఈ బలమైన కథ సాగనుండగా, ఇందులో శర్వానంద్ 'గంగా' అనే అత్యంత ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఆయన సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా క్లైమాక్స్ కోసం చిత్రబృందం ఏకంగా 30 రోజుల పాటు సాగిన భారీ యాక్షన్ షెడ్యూల్‌ను ఇటీవల విజయవంతంగా పూర్తి చేసింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.

# ఆనంద్ దేవరకొండ 'ఎపిక్' నుంచి 'మనసా వాచా' మెలోడీ సాంగ్ విడుదల!



ఆనంద్ దేవరకొండ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' నుంచి తాజాగా ఒక అద్భుతమైన మెలోడీ సాంగ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'మనసా వాచా' అంటూ సాగే ఈ మ్యూజికల్ ట్రీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటూ దూసుకుపోతోంది. ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించిన మధురమైన బాణీలు ఈ పాటకు ప్రాణం పోశాయి. వినడానికి ఎంతో ప్రశాంతంగా, హృద్యంగా ఉన్న ఈ గీతాన్ని లెజెండరీ సింగర్ కె.ఎస్. చిత్ర మరియు చరణ్ శ్రీపతి ఎంతో అద్భుతంగా ఆలపించారు. వీరిద్దరి మాయాజాల గళం పాటలోని భావోద్వేగాన్ని మరింత ఎలివేట్ చేయగా, శ్రీహర్ష ఇమాని అందించిన అర్థవంతమైన సాహిత్యం పాటలోని మాధుర్యాన్ని రెట్టింపు చేసింది.ఈ చిత్రంలో ఆనంద్ దేవరకొండ సరసన వైష్ణవి కథానాయికగా నటిస్తుండగా, టాలెంటెడ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. యూత్ ఫుల్ లవ్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదలైన ఈ మెలోడీ సాంగ్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది.

# బాలీవుడ్‌కి భాగ్యశ్రీ భోర్సే!

## 'ఆషికీ 2' హీరోతో రొమాన్స్..



దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటి భాగ్యశ్రీ భోర్సే బాలీవుడ్‌లో జాక్‌పాట్ కొట్టారు. 'ఆషికీ 2' ఫేమ్ ఆదిత్య రాయ్ కపూర్ సరసన ఆమె కథానాయకిగా నటించేందుకు రంగం సిద్ధమైంది. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు మిలప్ జవేరి తెరకెక్కించనున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలు ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.ప్రముఖ నిర్మాణ సంస్థ టి-సిరీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. గత నెలలో అధికారికంగా ప్రకటించిన ఈ చిత్రం, పూర్తి స్థాయి ఇంటెన్స్, వయొలెంట్ అండ్ మ్యూజికల్ లవ్ స్టోరీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మిలప్ జవేరి తనదైన శైలిలో హై-పిచ్ రొమాంటిక్ డ్రామాగా ఈ సినిమాను మలచనున్నారు. ఇందులో ఆదిత్య రాయ్ కపూర్ ఎమోషనల్ అండ్ లేయర్డ్ ఉన్న వైవిధ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో కథానాయకిగా భాగ్యశ్రీ భోర్సేను ఖరారు చేశారని, త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమై 2027లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం భాగ్యశ్రీ సినీ కెరీర్‌లో ఈ ప్రాజెక్ట్ ఒక బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. గత కొద్దికాలంగా ఆమె సౌత్ ఇండస్ట్రీలో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో దూసుకెళ్తున్నారు. రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఆమె, రౌడీ హీరో విజయ్ దేవరకొండతో 'కింగ్ డమ్', అలాగే స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తో కలిసి 'కాంత', ఇటీవల అఖిల్‌తో కలిసి లెనిన్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్నారు. హిందీలో ఇంతకుముందు కొన్ని చిన్న పాత్రలు చేసినప్పటికీ, ఇప్పుడు ఏకంగా టి-సిరీస్ లాంటి దిగ్గజ బ్యానర్‌లో, ఓ స్టార్ హీరో సరసన లీడ్ రోల్ చేయడం ఆమె కెరీర్‌కు మైలురాయిగా నిలవనుంది. త్వరలోనే చిత్ర యూనిట్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# మమితా బైజు ..మరో మూవీతో సిద్ధం



ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.

# తల్లిదండ్రుల మధ్య సేదదీరిన విజయ్ దేవరకొండ

## ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫోటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ డ్రామా 'రణబాలి' చిత్రంలో ఈ రియల్ లైఫ్ కపుల్ ఆన్ స్క్రీన్‌పై జంటగా నటిస్తున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465